# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భారత్ ముందుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5వ జాతీయ నీటి అవార్డులను రేపు న్యూఢిల్లీలో ప్రదానం చేయనున్నారు.
- భద్రతా దళాల అంకితభావం సమర్థత కారణంగా దేశం శాంతిని నెలకొల్పడంలో విజయం సాధించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
- ఉడాన్ పథకం దేశంలో కొత్త అవకాశాలను ఆవిష్కరించిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- “దానా” తుఫాను ప్రభావంతో ఈనెల 23వ తేదీన కోస్తాంధ్ర, ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

====================

ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భారత్ ముందుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు ఒక ప్రైవేట్ వార్తా సంస్థ నిర్వహించిన ప్రపంచ శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తూ… భారతదేశం రెండవ AI ఆకాంక్షిత దేశంగా ఎదిగిందని పేర్కొన్నారు. కోవిడ్-19, గ్లోబల్ ఎకానమీ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, యుద్ధాల, ప్రపంచ పరిస్థితులు భారతదేశాన్ని ప్రభావితం చేస్తాయని పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5వ జాతీయ నీటి అవార్డులను రేపు న్యూఢిల్లీలో ప్రదానం చేయనున్నారు. 2023 సంవత్సరానికి గాను ఉత్తమ రాష్ట్రం, ఉత్తమ జిల్లా, ఉత్తమ గ్రామ పంచాయతీ, ఉత్తమ పట్టణ స్థానిక సంస్థ, ఉత్తమ నీటి వినియోగదారుల సంఘం, ఉత్తమ పౌర సమాజం సహా 9 విభాగాల్లో 38 మంది విజేతలను కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉత్తమ రాష్ట్రం కింద ఒడిశాకు మొదటి బహుమతి లభించగా, ఉత్తరప్రదేశ్ రెండవ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో నీటి నిర్వహణ, నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రచారాన్ని చేపడుతున్నామని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది.

===================

భద్రతా దళాల అంకితభావం సమర్ధత కారణంగా దేశం శాంతిని నెలకొల్పడంలో విజయం సాధించిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారకం వద్ద పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు ఆయన నివాళులర్పించారు. అనంతరం ప్రసంగిస్తూ... మాదక ద్రవ్యాల వ్యాపారం, సైబర్ నేరాలు, చొరబాట్లు, ఉగ్రవాదం, కృత్రిమ మేధస్సు ద్వారా అశాంతిని వ్యాప్తి చేసే ప్రయత్నాలు దేశ సైనికుల సంకల్పానికి వ్యతిరేకంగా నిలబడలేవని ఆయన పేర్కొన్నారు..

===================

రీజనల్ కనెక్టివిటీ స్కీం ఉడాన్ పథకం దేశంలో కొత్త అవకాశాలను ఆవిష్కరించిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉడాన్ పథకం 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఉడాన్ పథకాన్ని మరో 10 సంవత్సరాల పాటు ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోందని, మరో 50 విమానాశ్రయాలను ప్రారంభించాలని అలాగే ఇప్పటికే ఉన్న విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచాలని యోచిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ పథకం కొత్త సందర్శకులు, పెట్టుబడిదారులు, అభివృద్ధి అవకాశాలను తీసుకువచ్చిందని, వేలాది మంది యువతకు ఉపాధి కల్పించిందని పేర్కొన్నారు.

===================

భారతదేశపు మొట్టమొదటి  ప్రాంతీయ ర్యాపిడ్ రైలు 'నమో భారత్' ప్రారంభమై ఈరోజుతో సంవత్సరం పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నమో భారత్ రైలులో ప్రయాణించి ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ ఆర్ఆర్టిఎస్ కారిడార్‌లోని కీలక స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో కలిసి ప్రయాణించి నమో భారత్ అనుభవాలను తెలుసుకున్నారు. నమో భారత్ రైలు సేవలను అభినందిస్తూ... ఘజియాబాద్, సాహిబాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రయాణాన్ని నమో భారత్ రైళ్లు గణనీయంగా మార్చాయని అన్నారు. నమో భారత్ రైలు సేవలను ఈ సంవత్సరం 40 లక్షల మంది ప్రయాణికులు వినియోగించుకున్నారని కేంద్ర మంత్రి తెలియజేశారు.

===================

"దానా" తుఫాను ప్రభావంతో రేపు అండమాన్ నికోబార్ దీవుల్లోనూ, అక్టోబర్ 23వ తేదీన కోస్తాంధ్ర, ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అక్టోబర్ 24, 25వ తేదీల్లో పశ్చిమ బెంగాల్, ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అస్సాం, త్రిపుర, మిజోరాం, మేఘాలయలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారిణి తెలియజేస్తూ....

(వాయిస్ 38 సెకన్లు)

విరామం

===================

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో (యుఎన్ఎస్‌సి) భారత్‌కు శాశ్వత స్థానం కల్పించాలని ఇటీవల పలువురు ప్రపంచ నాయకులు వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఈ జాబితాలో బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి డేవిడ్ కామెరూన్ కూడా చేరారు. కీలకమైన ప్రపంచ సవాళ్లపై భారతదేశ దృక్పథాన్ని ప్రపంచం వినాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. భవిష్యత్తులో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===================

ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన ఈ నెలలో వెయ్యి కోట్ల రూపాయల విలువైన అమ్మకాల మైలురాయిని దాటింది. నాణ్యమైన మందులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం విజయం వైపు అడుగులు వేసిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. గత 10 సంవత్సరాల్లో జనౌషధి కేంద్రాల సంఖ్య 170 రెట్లు పెరిగింది. ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన గత నెలలో 200 కోట్ల రూపాయల విలువైన మందులను విక్రయించిందని ఆ శాఖ పేర్కొంది. రానున్న రెండేళ్లలో దేశంలో 25 వేల జన్ ఔషధి కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని వెల్లడించింది.

===================

భారత్ - సింగపూర్ ద్వైపాక్షిక రక్షణ సంబంధాలు బలోపేతం చేసేందుకు  కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సింగపూర్ రక్షణ మంత్రి డాక్టర్ ఎన్‌జి ఎంగ్ హెన్ రేపు న్యూఢిల్లీలో చర్చలు జరపనున్నారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని ముందుకు తీసుకు వెళ్ళే లక్ష్యంతో పాటు ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు.

===================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో ఈ రోజు సెన్సెక్స్ 81,770 వద్ద ప్రారంభమై చివరకు స్వల్ప నష్టంతో 81,151.27 వద్ద ముగింది. నిఫ్టీ మార్కెట్ ముగిసే సమయానికి 72.95 పాయింట్లు కోల్పోయి 24,781.10 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.07గా ఉంది.

===================

లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఈరోజు న్యూ ఢిల్లీలో అసంఘటిత కార్మికుల కోసం వన్ స్టాప్ సొల్యూషన్‌ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, ఈశ్రమ్ పోర్టల్‌పై కార్మికులలో పెరుగుతున్న విశ్వాసాన్ని స్పష్టం చేశారు. ప్రతిరోజు సుమారు 60 నుండి 90 వేల మంది కార్మికులు దీనిలో చేరుతున్నారని, అసంఘటిత కార్మికులకు వివిధ సామాజిక భద్రతా పథకాలకు ఇది భద్రత కల్పిస్తుందని అన్నారు.

===================
===================